క్లుప్తంగా

లక్ష్యాలను పూర్తి చేయండి

పూతలపట్టు: తమకు ఇచ్చిన లక్ష్యాలను ఫీల్డ్ అసిస్టెంట్లు వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్నవారిలో సాధ్యమైనంత ఎక్కువ మంది ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సౌభాగ్యవతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీపై ప్రజావేదిక

యాదమరి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీపై బుధవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉపాధిహామీ పథకంలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై ఈ నెల 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆడిట్ జరిగిందన్నారు. దీనిపై బుధవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా తమ సమస్యలు తెలుపవచ్చని కోరారు.

వేసవి శిబిరానికి ఆదరణ



పిల్లలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరానికి ఆదరణ లభిస్తోంది. బాలబాలికలకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం పిల్లలకు చెస్, యోగా, మ్యాథ్స్, క్యారంబోర్డు, డ్యాన్స్, పాటలు పాడటం.. మొదలైన వాటిపై శిక్షణ ఇచ్చారు.

కారు-లారీ ఢీ

వి.కోట: వి.కోట-పలమనేరు రహదారిలోని మంగళవారం ఎదురెదురుగా వస్తున్న కారు-లారీ ఢీకొన్నాయి. ఈఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. పోలీసుల కథనం.. పలమనేరు వద్ద విరుపాక్షిపురం నుంచి వి.కోట వైపు కారు వస్తుండగా అదే సమయంలో వి.కోట నుంచి పలమనేరు వైపు వెళ్తున్న లారీ జవునిపల్లె క్రాస్ బ్రిడ్జి వద్ద ఢీకొన్నాయి. అదృష్టశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

కుప్పం జాతరకు వేళాయె

- నేటి నుంచి శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఉత్సవాలు
- ఆలయ పునర్నిర్మాణంతో మిన్నంటిన ఉత్సాహం
- సర్వం సిద్ధం చేసిన ఆలయ కమిటీ



జాతరకు ముస్తాబైన ఆలయం

కుప్పం : స్థానిక శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర బుధవారం ప్రారంభం కానుంది. తొమ్మిది రోజులు జరిగే ఈ జాతరకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 9న చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర లోపు ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. బుధవారం రాత్రి వినాయక ఉత్సవం ఊరేగింపుతో జాతర ప్రారంభం కానుంది. రాత్రి టీవీ నటీ నటుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ముత్తుమారెమ్మ ఉత్సవ ఊరేగింపు జరుగుతుంది. శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం, రాత్రి టీవీ కళాకారుల మెగా డాన్స్ ప్రోగ్రాం, సోమవారం రాత్రి ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, 54 పుష్పపల్లకిలు, బాణసంచా వేడుకులు, పచ్చగెరిగ, మంగళవారం తిరుపతిగంగమ్మ శిరస్సు ఊరేగింపు, బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన చైర్మన్ మంజునాథ్ తెలిపారు.



చలువ పందిళ్లు



జాతరకు ఆహ్వానం పలుకుతూ ఎగుర వేసిన బెలూన్లు

గంగమ్మా! కరుణించమ్మా..



అంబలి తెస్తున్న భక్తురాళ్లు



చిత్తూరు నడివీధిలో మంగళవారం గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. గంగమ్మ నామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. పెద్ద సంఖ్యలో మహిళలు అంబలిపోశారు. మొక్కులు చెల్లించారు. వయోభేదం లేకుండా వేషధారణల్లో అలరించారు. ప్రజలు, రాజకీయ నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలందించాయి. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

- చిత్తూరు రూరల్



గంగమ్మకు అంబలి సమర్పిస్తున్న భక్తులు



సింహవాహనంపై అమ్మవారు



గంగమ్మకు మొక్కుతున్న భక్తులు

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

- ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు నిండాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని పోటుకనుమ, ఎగువ హరిజనవాడ, దిగువ హరిజనవాడ, కర్ణంవారిపల్లి, చిగరపల్లిమిట్ట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి బుక్‌లెట్లను అందజేశారు. సీఎం అందిస్తున్న జగనన్న దీవెనతో తమ ఊర్లో విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారని, సీఎం జగనన్నకు ఎల్లప్పుడూ తాము రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తమ బతుకులు మారాయన్నారు. పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నామని, జగనన్నకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు, శ్మశాన సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యేకి విన్నవించగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని విధాలుగా మీకు అండగా ఉంటున్న జగనన్నను 2024లో మరోసారి సీఎంను చేసుకునేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో



గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, నాయకులు తలుపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, సుధాకర్ రెడ్డి, సర్పంచ్ బాబునాయుడు, ఎంపీడీఓ గౌరి, ఎస్‌ఐ హరిప్రసాద్, నిరంజన్‌రెడ్డి, మణి, ప్రవీణ్, షణ్ముగం, బాలాజీ, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

నేడు పోటుకనుమ పంచాయతీలో..

పోటుకనుమ పంచాయతీలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి తెలిపారు.



తవణంపల్లె నడివీధిలో వెలసిన నడివీధి గంగమ్మ

కోలాహలంగా జాతర



తవణంపల్లె: సత్యమ్మకు అంబలి పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గుడిపాల: వర్షాలు కురిపించి, పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని బసవాపల్లె గ్రామస్తులు సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పలువురు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: తవణంపల్లె, దిగువ తడకర, టి.పుత్తూరుతో పాటు పలు గ్రామాల్లో నడివీధి గంగజాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం తవణంపల్లెలో సత్యమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంబలి పోసి, అమ్మవారికి సారెలు సమర్పించి, చల్లగా చూడు తల్లీ అంటూ మొక్కులు చెల్లించారు. అలాగే టి.పుత్తూరులో గ్రామస్తులు సత్యమ్మకు, దిగువ తడకరలో గంగమ్మకు అంబలి పోసి, పొంగళ్లు పెట్టారు. తవణంపల్లెలో నడివీధిలో గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర వేడుకలు ఘనంగా ప్రారంభించారు. పూతలపటులో ఉదయం అమ్మవారికి తొలిపూజ చేసి జాతరను ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఊరేగింపుగా వచ్చి పిండి వంటలను సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవారి వేషధారణలతో ఆకట్టుకున్నారు. మండలంలో ఓంశక్తి భక్తులు దీక్షలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



బసవాపల్లెలో అమ్మవారికి చేస్తున్న పూజలు



వివిధ వేషధారణలో ఉన్న భక్తులు



పూతలపట్టులో ..

క్షేత్రస్థాయిలో పక్కాగా 'మిషన్ లైఫ్'



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగర పరిధిలో మిషన్ లైఫ్ 2022–23 కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పక్కాగా, విజయవంతంగా నిర్వహించాలని నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న మిషన్ లైఫ్ 2022–23 కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం నిర్దేశించిన ఏడు విభాగాల్లోని 75 వ్యక్తిగత జీవన చర్యలను నగరపాలక సంస్థ పరిధిలో విజయవంతంగా నిర్వహించడంపై సంబంధిత విభాగాల అధికారులతో మంగళవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్, మెప్మా, ప్రణాళిక విభాగం పరిధిలో నిర్దేశించిన వ్యక్తిగత జీవన చర్యలకు సంబంధించి కార్యక్రమాలను సంబంధిత వార్డు కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ప్రతి అంశంపై నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఫొటోలు తీయాలన్నారు. మిషన్ లైఫ్ 2022–23 కార్యక్రమం లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతర ఎఫెక్ట్ 20 రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: స్థానికంగా గంగమ్మ జాతర, మంగళవారం కావడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. చిత్తూరులోని అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజు దాదాపు 50 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ పండుగ ఎఫెక్ట్‌తో 20 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. కొందరు బుధవారం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అక్‌నాలడ్జ్‌మెంట్ తీసుకున్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ రేపు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఎంపీపీ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

జాతరలో పోలీసుల డేగ కన్ను

అధికారులను అభినందించిన ఎస్పీ

చిత్తూరు అర్బన్: గంగజాతరలో పోలీసులు బందోబస్తు పరంగా తీసుకున్న చర్యలను ఎస్పీ అభినందించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే పిల్లలందరికీ ట్యాగ్‌లో తల్లిదండ్రుల ఫోన్ నంబరు నమోదు చేయించారు. దీంతో తప్పిపోయిన పిల్లల ఆచూకీ సులభతరంగా మారింది. దీంతో పాటు ఎప్పటికప్పుడు మైక్‌సెట్‌ల ద్వారా ప్రజలకు అప్రమత్తం చేస్తూ వచ్చారు. నిఘా వ్యవస్థలో భాగంగా ఇంటిగ్రేటెడ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించారు. ఈవిధానంతో అధికారుల తీరు భేష్ అంటూ ఎస్పీ రిశాంత్ అభినందించారు.



పిల్లలకు ట్యాగ్ తొడుగుతున్న మహిళా పోలీసు

కర్మక్రియలకు మంత్రి ఆర్థికసాయం

వడమాలపేట : మండలంలోని ఏఎంపురం ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం (అలియాస్ ఎర్రబ్బ), శ్రీవిద్య మామిడి కాయలు కోసేందుకు వెళ్లి ట్రాక్టర్‌లో ఇంటికి వెళ్తుండగా బోల్తా పడడంతో గతవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలను మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. వారికి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున కర్మక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత్‌కుమార్ భారతి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, వడమాలపేట సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యంరాజు, నాయకులు సుబ్రమణ్యంరాజు, ఉమాపతి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం ఇస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత



తవణంపల్లె : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ఐరాల: మండలంలోని పొలకల–1లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 101 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గర్భిణులు కొబ్బరి నీళ్లు, పండ్లరసం, మజ్జిగ, ఓఆర్ఎస్, నీరు, అధికంగా తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని సరకల్లులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 65 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీలు



యాదమరిలో..

బంగారుపాళెం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం బంగారుపాళెంలో ఆరోగ్యశాఖ సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 'దోమలను నిర్మూలిద్దాం–డెంగీని నివారిద్దాం, దోమకాటు–ఆరోగ్యానికి చేటు, ఇంటిశుభ్రత–ఆరోగ్యానికి రక్ష' అని నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట డెంగీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ రమేష్ మాట్లాడారు. సీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ విజయకుమారి, సీహెచ్ఓ షమీమ్, సబ్ యూనిట్ అధికారి పీరూసాహెబ్, ఎంపీహెచ్ఈఓ బృహస్పతి, రమేష్‌బాబు, విస్తరణాధికారి హరికృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: డెంగీపై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ సుగుణవతి, పీహెచ్ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: యాదమరిలో వైద్యాధికారి సురేఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మాట్లాడారు. పల్లెల్లో డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారించడం సాధ్యమౌతుందని మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.సీహెచ్ఓ వెంకటరమణ, పీహెచ్ఎన్ భారతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బంగారుపాళెంలో డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఐరాల: డెంగీ వ్యాధిపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



తవణంపల్లెలో..

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పోస్టర్లతో ప్రచారం

గుడుపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె, శెట్టిపల్లె, బెగ్గిలిపల్లెలో ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతులు సేంద్రియ ఎరువులు, కషాయాలతో మందులు తయారు చేసుకుని పంటలు పండించాలన్నారు. ఆరోగ్యకర పంట దిగుబడులు రావాలంటే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. కార్యదర్శి చంద్రప్ప, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మునికృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.